

మున్సిపాలిటీల్లో శివారు గ్రామాల విలీనం

రామచంద్రాపురం, సెప్టెంబరు 3: సంగారెడ్డి జిల్లా పరిధిలోని 11 గ్రామాలను మున్సిపాలిటీల్లో కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. తెల్లాపూర్ మున్సిపాలిటీలో పటాన్‌చెరు మండలంలోని పాటి, ఘనాపూర్, కర్దనూర్, ముత్తంగి, పోచారం గ్రామాలను కలిపారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఐలాపూర్, ఐలాపూర్ తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, దాయర, సుల్తాన్‌పూర్ గ్రామాలను విలీనం చేశారు. త్వరలోనే ఆయా మున్సిపాలిటీను సైతం జీహెచ్ఎంసీలో విలీనం చేయనున్నారని తెలుస్తున్నది.

గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ● ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

మెదక్ అర్బన్, సెప్టెంబరు 3: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, మున్సిపాలిటీ, మత్స్యశాఖ అధికారులతో గణేష్ నవరాత్రులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను సామరస్యపూర్వకంగా నిర్వహించుకోవడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గణేష్ మండపాలను పరిశీలించాలని, అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. నిమజ్జనం, శోభాయాత్రలకు ఉత్సవ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చెరువుల వద్ద గజఈతగాళ్లను, క్రేన్లను ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో స్పందించడానికి అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని నిర్దేశించారు. మట్టితో చేసిన విగ్రహాలనే ఏర్పాటు చేసేలా, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మట్టి ప్రతిమలనే ప్రతిష్ఠించాలని అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్, తూప్రాన్ ఆర్డీవోలు రమాదేవి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ముందు స్కూల్ ఉందన్నారు.. తర్వాత సెలవిచ్చారు!

● గజిబిజిగా సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారుల తీరు

● తీవ్ర అవస్థలు పడ్డ విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3: ఒకవైపు ఎడతెరిపి లేని వర్షాలు మరోవైపు విద్యాశాఖ అధికారుల గజిబిజి వ్యవహారంతో సంగారెడ్డి జిల్లాలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడ్డారు. మంగళవారం ఉదయం 7 గంటలకు పాఠశాలలు యథావిధిగా నడపాలని ఎలాంటి సెలవులు లేవని సమాచారం చేరవేసిన అధికారులు.. ఆ తర్వాత 7.40 గంటలకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని మొగుడంపల్లి, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ మండలాల పాఠశాలలకు, 7.55 గంటలకు కోహీర్, సదాశివపేట, మునిపల్లి, కొండాపూర్, సంగారెడ్డి మండలాల పాఠశాలలకు.. తదుపరి 9.40 గంటలకు జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ క్రమంలో ఎవరైన విద్యార్థులు బడికి వచ్చినట్లయితే వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి జాగ్రత్తగా ఇళ్లకు చేరవేయాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు. ఈ విధంగా విడతల వారీగా సెలవు ప్రకటించడంతో జిల్లావ్యాప్తంగా పలువురు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాఠశాలలకు వచ్చి అవస్థలు పడుతూ ఇళ్లకు తిరిగి వెళ్లారు. సెలవు సమాచారాన్ని ఆలస్యంగా చేరవేయడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



జలకళ

తీరిన అన్నదాత చింత

● ఆలస్యంగానైనా కరుణించిన వరుణుడు ● నిండిన చెరువులు, కుంటలు

మెదక్ జిల్లాలో అలుగు పారుతున్న 475 చెరువులు

దాదాపుగా నిండిన మరో 827

మెదక్, సెప్టెంబరు 3: సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఆశించినంత వర్షాలు లేక రైతన్నలు ఆందోళన చెందుతున్న తరుణంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు పంటల సాగుకు భరోసానిస్తున్నాయి. ఈసారి వానాకాలం సీజన్ ప్రారంభం నుంచీ మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఆశించినంత వర్షాలు లేక వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. బోర్లు, బావుల కింద నాట్లు వేసుకున్నా భూగర్భ జలాలు తగ్గుతుండడంతో ఆందోళన వ్యక్తమైంది. ఈ తరుణంలో కురుసున్న భారీ వర్షాలు అన్నదాత ఆశలకు జీవం పోశాయి. జిల్లావ్యాప్తంగా 2,694 చెరువులు ఉండగా.. ప్రస్తుత వర్షాలకు 475 చెరువులు అలుగు పారుతున్నాయి. 827 చెరువుల్లో 75 శాతానికి పైగా నీరు వచ్చింది. 931 చెరువుల్లోకి 50 శాతానికి పైగా నీరు వచ్చింది. 461 చెరువుల్లో 25 నుంచి 50 శాతం వరకు కొత్తనీరు వచ్చిందని ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని ఏకైక మధ్యతరహా ప్రాజెక్ట్ ఘనపూర్ ఆనకట్ట, జిల్లా శివార్లలోని పోచారం ప్రాజెక్ట్ అలుగు పారుతున్నాయి. జిల్లాలో సెప్టెంబరు మాసంలో 547 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం కురియాల్సి ఉండగా.. రెండు రోజుల వ్యవధిలోనే 22 సెంటీమీటర్లు నమోదైంది. కౌడిపల్లి, హవేళీఘనపూర్, మనోహరాబాద్, నర్సాపూర్, అల్లాదుర్గం మండలాలు లోటు వర్షపాతాన్ని అధిగమించాయి. ఈ వర్షాలకు మరో 75 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అంచనా వేస్తున్నారు. ఆశించిన వర్షాలు లేకపోవడంతో జిల్లా వ్యవసాయశాఖ తన పంటల ప్రణాళికలో వరి సాగు విస్తీర్ణం కేవలం 2 లక్షల ఎకరాలకే పరిమితం చేసింది. కానీ, ప్రస్తుత వర్షాలకు వరి విస్తీర్ణం 2.75 లక్షల ఎకరాలకు చేరుకుంటుందని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ తెలిపారు. జలాశయాల్లోకి పుష్కలంగా నీరు రావడంతో యాసంగి పంటల సాగు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాలకు హవేళీఘనపూర్ మండలంలో పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

నిండు కుండలా సింగూరు

● ప్రస్తుతం ప్రాజెక్టులో 21.536 టీఎంసీల నీటి నిల్వ

● ఎగువ నుంచి 33,920 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

● మూడు, నాలుగు రోజుల్లో నిండే అవకాశం

పుల్‌కల్, సెప్టెంబరు 3: సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్ డివిజన్లలోని మంజీర నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షానికి భారీగా నీరు వచ్చి చేరుతున్నది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టులోకి 33,920 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదయింది. ప్రవాహం ఇలాగే కొనసాగితే మూడు, నాలుగు రోజుల్లో ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకునే అవకాశముందని అంచనా వేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 523.6 మీటర్లకు 29.917 టీఎంసీలు. కాగా, మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు 521.980 మీటర్లకు 21.536 టీఎంసీల నీరు ఉన్నది.

మంజీర రిజర్వాయర్‌కు వరద ఉధృతి

సింగూరు ప్రాజెక్టుకు దిగువన.. సంగారెడ్డి మండలం కలబ్‌గూర్ గ్రామ శివారులో నిర్మించిన మంజీర రిజర్వాయర్‌కు వరద ఉధృతి పెరిగింది. దీంతో అధికారులు 2వ నంబరు క్రస్ట్‌గేట్‌ను రెండు మీటర్లు ఎత్తు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మంజీర రిజర్వాయర్‌కు ఎగువన గంగకత్వ వాగు, నందివాగుతో పాటు ఇతర చిన్న చిన్న వాగులు, వంకల నుంచి వరద నీటి ప్రవాహం వచ్చి చేరుతున్నది. రిజర్వాయర్‌లోకి 3,695 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 4,286 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మంజీర రిజర్వాయర్ పూర్తి నిల్వ సామార్థ్యం 1,651 అడుగులకు.. 1,500 ఎంసీఎఫ్‌టీలు. కాగా, ప్రస్తుతం 1,650 అడుగులకు 1,239 ఎంసీఎఫ్‌టీల నీరు నిల్వ ఉన్నది. ఎగువ నుంచి వరద వస్తుండడంతో మంజీరా నది పరివాహక ప్రాంతాల్లో రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని చౌటకూర్ మండల ఇన్‌చార్జి తహసీల్దారు కృష్ణ కోరారు.

పొంగిపొర్లుతున్న నల్లవాగు ప్రాజెక్టు

కల్హేర్: భారీ వర్షాలకు సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. పూర్తిస్థాయి నీటి మట్టం 1,493 అడుగులకు చేరుకున్నది. 5,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అలుగు పైనుంచి 5,200 క్యూసెక్కులు దిగువన మంజీరా నదిలోకి వెళ్తున్నది. 0.6 టిఎంసీ నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద 5,100 ఎకరాల ఆయకట్టు ఉన్నది.



అలుగుపారుతున్న మెదక్ మండలం రాయిన్‌పల్లి చెరువు



నల్లవాగు ప్రాజెక్టు అలుగు



నిండుగా నీటితో తొణికిసలాడుతున్న సింగూరు ప్రాజెక్టు

పేరుకే అవుట్‌పోస్టు.. పోలీసులేరీ?

సంగారెడ్డి జీజీహెచ్‌లో భద్రత కరువు

కోల్‌కతా ఘటన నేపథ్యంలో వైద్యులు, రోగుల ఆందోళన



సంగారెడ్డి జీజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద భద్రతా సిబ్బంది లేక ఖాళీగా ఉన్న పోలీస్ అవుట్‌పోస్టు గది

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3 : పోలీసు ఉండరు.. ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది అసలే కనబడరు.. ఇదీ సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్టు దుస్థితి. ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది, ఉద్యోగులు, రోగులు, వారి సహాయకుల రక్షణ కోసం పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేశారు. తొలుత ఒక పోలీస్ కానిస్టేబుల్ మాత్రమే ఇక్కడ విధులు నిర్వహించేవారు. కొద్దిరోజులకు ఒక్క పోలీసును కూడా తొలగించి, ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బందిని నియమించారు. ఆ తరువాత వారిని కూడా తొలగించారు. దీంతో, అవుట్‌పోస్టు కాస్తా నిరాశ్రయులు, భిక్షాటన చేసేవారికి ఆవాసంగా మారింది.

భద్రతపై వైద్యుల ఆందోళన

కోల్‌కతా నగరంలోని ఓ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తున్న విషయం తెలిసిందే. అటువంటి భయానక ఘటన నేపథ్యంలో వైద్యుల భద్రతకు భరోసా కల్పించాలని రాష్ట్రంలోనూ వైద్య సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రతీ మెడికల్ కాలేజీ, అనుబంధ బోధనాస్పత్రి ద్వారం వద్ద పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలన్నదే వారి ప్రధాన వాదన. సంగారెడ్డి జీజీహెచ్‌లో అన్ని కేడర్ల ఉద్యోగులు, డాక్టర్లు, సిబ్బంది వెయ్యి మంది పనిచేస్తున్నారు. 300 మంది మెడికోలు వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. నిత్యం 2వేల మంది వరకు రోగులు ఓపీ, ఐపీ వైద్య సేవలు పొందుతుంటారు. ఇంత కీలకమైన చోట పోలీసుల భద్రత లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ వారు అన్ని వార్డుల్లో ఉండరు. సెక్యూరిటీ లేని ఆయా వార్డుల్లోనూ మహిళా వైద్య సిబ్బంది డ్యూటీల్లో ఉంటారు. ఈ నేపథ్యంలో వారి భద్రతకు భరోసా కల్పించాల్సి అవసరం ఉందని ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. ఏదైనా ఘటన జరిగిన తరువాత మేల్కొనే కంటే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఓ సీనియర్ ప్రొఫెసర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

జీజీహెచ్‌కు కార్డియాలజీ ప్రొఫెసర్

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

వరంగల్ నుంచి పదోన్నతిపై ఇక్కడికి బదిలీ

అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ సేవలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 3 : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎట్టకేలకు గుండె వైద్య నిపుణుడిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వరంగల్ ఎంజీఎం-కాకతీయ మెడికల్ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సి.మమతరెడ్డి ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది బదిలీపై ఇక్కడికి రానున్నారు. సంగారెడ్డి మెడికల్ కాలేజీ ఏర్పాటు అనంతరం సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల్లో భాగంగా కార్డియాలజీ ప్రొఫెసర్ ఇక్కడ నియమితులు కావడం ఇదే తొలి సారి అని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

గురుకులంలో గాడితప్పిన క్రమశిక్షణ

తూప్రాన్ గురుకులంలో ఘర్షణ వాతావరణం

సీనియర్లు.. జూనియర్లు అంటూ విభేదాలు

కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ మారని విద్యార్థుల తీరు

ఇప్పటికే రెండుసార్లు దాడులు

పర్యవేక్షణ కొరవడటమే కారణమా?



తూప్రాన్, సెప్టెంబరు 3: గురుకులం అంటేనే క్రమశిక్షణకు మారు పేరు.. అక్కడ చదువు అంటే గుర్తింపు.. ఇవన్నీ ఒకప్పటి మాట. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారు టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో వరుస ఘటనలు అదంతా ఒకప్పటి మాట అనేట్లు చేస్తున్నాయి. తూప్రాన్ వద్ద 2002లో తెలంగాణ గురుకుల పాఠశాల మంజూరైంది. సొంత భవనం లేక వర్గల్ మండలం నాచారం వద్ద నిర్వహించారు. మాజీ మంత్రి గీతారెడ్డి చొరవతో అల్లాపూర్ శివారలో హైవే పక్కనే కొత్త భవనం నిర్మించి 2008 నుంచి అక్కడే నిర్వహిస్తున్నారు. 2018లో తెలంగాణ గురుకుల పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ కోర్సులను ప్రారంభించారు. ప్రస్తుతం 579 మంది విద్యార్థులు చదువుతున్నారు.

దాడుల సంస్కృతి

తూప్రాన్ గురుకుల పాఠశాల అంటే ఒకప్పుడు మంచి గుర్తింపు ఉండేది. కానీ ప్రస్తుతం క్రమశిక్షణ తప్పి సీనియర్లు, జూనియర్లు పరస్పరం దాడులు చేసుకుంటున్నారు. జూలై 16న రాత్రి ఇంటర్ విద్యార్థులు జూనియర్లపై విచక్షణ కోల్పోయి దాడులు చేశారు. సీనియర్లకు గౌరవం ఇవ్వడం లేదని కక్ష పెంచుకుని, మాట్లాడుకుందామని పిలిచి దాడులు చేయడంతో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. గదిలోని సీలింగ్ ఫ్యాన్, బకెట్లు ధ్వంసమయ్యాయి. అప్పట్లో గురుకుల పాఠశాలల కార్యదర్శి రమణకుమార్, తూప్రాన్ సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందం, ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి గురుకులాన్ని సందర్శించి విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కానీ నెలన్నర గడవక ముందే రెండ్రోజుల క్రితం చిన్న విషయానికే వివాదం చెలరేగి దాడులకు దారితీసింది. ఆదివారం రాత్రి 10వ తరగతి విద్యార్థిని జూనియర్లు తోసేశారని కక్ష పెంచుకుని.. 9 మంది సీనియర్లు కలిసి తొమ్మిదో తరగతి విద్యార్థులు ముగ్గురిని విచక్షణారహితంగా కొట్టారు. దీంతో వారిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయాల్సి వచ్చింది. ఈ విషయంపై మంగళవారం ఉన్నతాధికారులు మరోసారి గురుకులాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. దాడిచేసిన సీనియర్లకు టీసీ ఇచ్చి పంపించేందుకు సన్నద్ధమయ్యారు.

వార్డెన్ లేక వంతులవారీగా నైట్‌డ్యూటీ

తూప్రాన్ గురుకులంలో క్రమశిక్షణ కొరవడిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్య నేర్చుకోవాల్సినవారు సీనియర్లు, జూనియర్లు అంటూ భేషజాలకు పోతున్నారు. క్రమశిక్షణ నేర్పాల్సిన టీచర్లూ పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. కొంతకాలం క్రితం వరకు పీఈటీ లేకపోవడం, రాత్రుల్లో విధులు నిర్వహించేందుకు ఇప్పటికీ వార్డెన్ లేకపోవడంతో విద్యార్థులకు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వార్డెన్ లేకపోవడంతో అధ్యాపకులే వంతులవారీగా నైట్ డ్యూటీ నిర్వహిస్తున్నారు. ఇటీవల గురుకులంలో జరిగిన ఘటనలు రాత్రుల్లోనే జరగడం గమనార్హం. అధికారులు స్పందించి వార్డెన్‌ను నియమించాలని, విద్యార్థుల నడవడికపై నిఘా పెట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.





సీనియర్ల దాడిలో గాయపడిన విద్యార్థులు (ఫైల్)

ప్రాణం తీసిన అనుమానం

● చేతబడి చేస్తున్నారని దాడి.. ఒకరి మృతి ● ఇద్దరు మహిళలకు గాయాలు ● మెదక్ జిల్లా టేక్మాల్‌లో ఘటన

టేక్మాల్, సెప్టెంబరు 3: చేతబడి చేస్తున్నారన్న అనుమానంతో గ్రామస్థులు ఓ కుటుంబంపై దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం గొల్లగూడెం గ్రామంలో మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బురుజుకింద గంగమ్మ వద్దకు వరుసకు మేనమామ అయిన మెదక్‌లోని నావపేట వీధికి చెందిన రాములు(52) ఆదివారం సాయంత్రం వచ్చాడు. అతనికి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో టేక్మాల్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అయితే, గంగమ్మ స్నేహితురాలైన బాలమణి.. రాములుకు దిష్టితీసి కల్లు, కోడిగుడ్లు రోడ్డుపై పారబోయమని చెప్పింది. ఆమె ఆదివారం రాత్రి అలాగే చేయడంతో గ్రామస్థులు వారు చేతబడి చేస్తున్నారని అనుమానించారు. సోమవారం అమావాస్య కావడంతో చేతబడి చేశారని అనుమానించి.. మంగళవారం ఉదయం ఇంట్లో ఉన్న రాములు, గంగమ్మ, బాలమణిలను చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి.. దాడిలో తీవ్రంగా గాయపడిన వారిని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే రాములు మృతి చెందాడని నిర్ధారించారు. ఘటనాస్థలాన్ని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, అల్లాదుర్గం సీఐ రేణుక పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. రాములు కుమారుడు శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గొల్లగూడెం గ్రామంలో విచారణ చేస్తున్న పోలీసులు

కూలిన ఇళ్లు.. నీట మునిగిన పంటలు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో మూడో రోజూ కొనసాగిన వర్షం

పొంగిపొర్లిన వాగులు, వంకలు

వరద కాలువలను తలపించిన రోడ్లు

ప్రవాహానికి కల్వర్టులు, లోలెవల్ కాజ్‌వేలు ధ్వంసం



8లో

కల్హేర్ మండలంలోని మీర్‌ఖాన్‌పేట, బాచేపల్లి గ్రామాల నడుమ వంతెనపై నుంచి పారుతున్న మాసాన్‌పల్లి వాగు

వరదలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన పోలీసులు 7లో

కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు

● విచారణ అనంతరం శిక్షను విధించిన కోర్టు

● గజ్వేల్‌లో మోటార్ సైకిళ్ల దొంగతనం కేసులో ఒకరికి ఏడాది, ఇద్దరికి ఆరునెలల జైలుశిక్ష

గజ్వేల్, సెప్టెంబరు 3: కొత్త చట్టాల (బీఎన్ఎస్) ప్రకారం నమోదైన కేసులో గజ్వేల్ న్యాయమూర్తి సౌమ్య తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా తెలిపారు. నెల క్రితం గజ్వేల్‌లో మోటార్ సైకిల్ చోరీ కేసులో మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన ప్రశాంత్‌రెడి, రామాయంపేట మండల కేంద్రానికి చెందిన శివశంకర్, మంగళ్‌హాట్ హైదరాబాద్‌కు చెందిన రాయలపురం యాదగిరిని అరెస్టు చేశారు. గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.సౌమ్య విచారణ జరిపారు. నేరం ఒప్పుకున్నందున ప్రశాంత్‌కు ఏడాది, శివశంకర్, యాదగిరికి ఆరు నెలల చొప్పున జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించినట్లు తెలిపారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శంకర్, గోపాల్ గౌడ్, ఎస్ఐ శంకర్, ఎస్ఐ గోపాల్‌గౌడ్, కోర్టు కానిస్టేబుల్ కుమార్ కీలకపాత్ర పోషించారని సీఐ తెలిపారు.

వరద బాధితులకు రూ.1.25 కోట్ల విరాళం

● టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్



మెదక్ అర్బన్, సెప్టెంబరు 3: భారీ వర్షాల కారణంగా జనజీవనానికి ప్రాణ, ఆస్తి, పంట అనేక రకాలుగా నష్టం జరిగిందని, వారిని ఆదుకునేందుకు మెదక్ జిల్లా ఉద్యోగుల ఐక కార్యాచరణ సమితి ప్రభుత్వానికి అండగా నిలిచిందని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పేర్కొన్నారు. సీఎం సహాయ నిధికి తమవంతు సహాయంగా సెప్టెంబరు నెలలో ఒకరోజు మూల వేతనం దాదాపు రూ.1.25 కోట్లను విరాళంగా

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

● బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 3: బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి మృతి చెందిన రాట్ల సూర్య కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మెదక్ మండల పరిధిలోని తిమ్మక్కపల్లి తండాలోని మృతుడి కుటుంబాన్ని ఆయన పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వస్తే బతుకులు మారుతాయనుకుంటే నిరుపేదల బతుకులు తెల్లారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఉద్యోగ, ఉపాధి పట్ల నిర్లక్ష్యం వహించడం వల్లే వలసలు కొనసాగుతున్నాయన్నారు. సూర్య భార్య సరితకు రాష్ట్ర సర్కార్ ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుని కుటుంబానికి ఉద్యోగంతోపాటు వారి పిల్లలకు ఉచిత విద్యను అందించాలన్నారు. పార్టీ తరపున దుబాయ్ రాయబార కార్యాలయంలో సంప్రదింపులు జరిపినట్లు చెప్పారు. వీలైనంత త్వరగా సూర్య మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, వీణ, మెదక్ పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీనివాస్

శభాష్..పోలీసన్నా..

● వరదలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన ఖాకీలు


వరదలో చిక్కుకున్న వ్యక్తిని రక్షిస్తున్న పోలీసులు

టేక్మాల్, సెప్టెంబరు3 : భారీ వర్షాలకు టేక్మాల్ సమీపంలో గుండు వాగు పొంగింది. నీరు రోడ్లపై నుంచి జోరుగా ప్రవహిస్తున్నప్పటికీ వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి రోడ్డును దాటే క్రమంలో ప్రవాహ వేగానికి కొట్టుకుపోయాడు. కాసేపటికి ఓ రాయిపైకి చేరాడు. అయితే అక్కడ వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్న టేక్మాల్ ఏఎస్ఐ దయానంద్, సిబ్బంది అతడిని తాడు సహాయంతో రక్షించారు.

చేపల వేటకు వెళ్లి గల్లంతైన

వ్యక్తి మృతదేహం లభ్యం


లక్ష్మణ్ మృతదేహన్ని తీసుకొస్తున్న పోలీసులు

బెజ్జంకి, సెప్టెంబరు 3: చేపల వేటకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని తోటపల్లికి చెందిన సందిరి లక్ష్మణ్ (45) ఆదివారం గ్రామశివారులో కల్వర్టు వద్ద చేపలు పట్టేందుకు వెళ్లాడు. వరద ఉధృతి ఎక్కువ కావడంతో నీటిలో గల్లంతయ్యాడు. రెండు రోజులుగా పోలీస్, రెస్క్యూ టీం, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం మృతదేహం చెట్లపొదల్లో లభ్యమైంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు శ్రవణ్‌కుమార్ ఉన్నారు. మృతుడి కుమారుడు శ్రవణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. సంఘటన స్థలాన్ని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు.

గుండెపోటుతో డీసీఎం డ్రైవర్ మృతి


రాంసాగర్ శివారులో వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

రాయపోల్, సెప్టెంబరు 3: గుండెపోటుతో డీసీఎం డ్రైవర్ మృతిచెందిన సంఘటన రాయపోల్ మండలం రాంసాగర్ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. రాయపోల్ ఎస్ఐ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన హమీదుల్లాఖాన్(60) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం కర్కపట్ల నుంచి బోధన్‌కు వెళ్లేందుకు కోడిగుడ్ల లోడుతో బయలుదేరాడు. ఈ క్రమంలో రాయపోల్ మండలం రాంసాగర్ శివారులోకి రాగానే డ్రైవింగ్ చేస్తుండగానే హమీదుల్లాఖాన్ ఛాతిలో నొప్పి రావడంతో వాహనాన్ని పక్కకు ఆపి కిందికి దిగాడు. అనంతరం నొప్పి తీవ్రం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన చుట్టుపక్కల పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు మృతుని భార్య ఆసిఫ్‌అలీ ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

బాగా చదువుకోవాలన్నందుకు

పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న శృతి

తూప్రాన్, సెప్టెంబరు 3: మంచిగ చదువుకోవాలని తండ్రి సూచించడంతో మనస్తాపంతో పదోతరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధిలోని ఆబోతుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం ఆబోతుపల్లికి చెందిన నక్కలపల్లి మహేందర్, రేఖ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. పెద్దకూతురు శృతి (15) తూప్రాన్‌లోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం తండ్రి మహేందర్ శృతితో బాగా చదువుకోవాలని, చదువును నిర్లక్ష్యం చేయకూడదని సూచించాడు. అనంతరం ఆయన గేదెలు మేపేందుకు వెళ్లాడు. మనస్తాపం చెందిన శృతి బెడ్‌రూంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండురోజుల్లో

1800 కోళ్ల మృత్యువాత

● వర్షానికి తడవడం వల్లే..


మృతి చెందిన కోళ్లు

రాయపోల్, సెప్టెంబరు 3: డెలివరీ చేయాల్సిన సమయంలో వర్షానికి తడిసిన దాదాపు 1800 కోళ్లు ఫారంలోనే మృతిచెందాయి. బాధితుడు బచ్చు సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వడ్డేపల్లిలో సంతోష్ పౌల్ట్రీఫాంను లీజుకు తీసుకుని కోళ్లను పెంచుతున్నాడు. ఈ క్రమంలో నిజామాబాద్‌కు చెందిన పబ్బేజ్ ట్రేడింగ్ కంపెనీకి మూడు వేల లేయర్ కోళ్ల కోసం ఆర్డర్ చేశాడు. ఇందుకు సంబంధించి పూర్తి డబ్బును సంబంధిత ఏజెన్సీకి పంపించాడు. సంబంధిత కంపెనీ ఈనెల 1న కోళ్లను వ్యాన్‌లో పంపించింది. అవి అప్పటికే తడిసిపోయి ఉన్నాయి. బాధితుడు ఈ విషయాన్ని సదరు ట్రేడింగ్ కంపెనీకి సమాచారం ఇచ్చి అన్‌లోడ్ చేసుకున్నాడు. తడిసిన కోళ్లు కోలుకోకపోవడంతో రెండు రోజులుగా సుమారు 1800 కోళ్లు మృత్యువాతపడ్డాయి. బాధితుడు తనకు న్యాయం చేయాలంటూ రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేస్తామని ఎస్ఐ రఘుపతి పేర్కొన్నారు.

రుణం చెల్లించాలని రైతుకు బ్యాంకు నోటీసులు

● రుణమాఫీ కాకపోవడంపై ఆందోళన


చిన్నశంకరంపేట, సెప్టెంబరు 3 : ఇటీవల ప్రకటించిన రుణమాఫీలో ఓ రైతుకు రుణమాఫీ కాలేదని, రుణాన్ని చెల్లించాలంటూ చిన్నశంకరంపేట ఏపీజీవీబీ బ్యాంకు అధికారులు మంగళవారం నోటీసులు పంపించారు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గజగట్లపల్లికి చెందిన ఎనుగుల పద్మమ్మ 2020లో సాగు నిమిత్తం రూ.1.45లక్షల రుణాన్ని తీసుకున్నది. తీసుకున్న రుణానికి రెనివల్ చేసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ తమకు వర్తించలేదని ఆ రైతు కుటుంబీకులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తమకూ రుణమాఫీ చేయాలని కోరుతున్నారు.

వర్షాకాలం జరపైలం

ప్రమాదాలు, అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరి



మెదక్ కల్చరల్, సెప్టెంబరు 3: నిన్నటి వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వానలు కురిశాయి. ఈ క్రమంలో వాగులు, చెరువులు పొంగిపొర్లాయి. ఇక లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. ఈ వానల వల్ల రహదారులు సైతం కొట్టుకుపోయాయి. మంచినీటి పైపులైన్లు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉంది. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. ఈ తరుణంలో రోజువారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు కాస్త జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం కూడా ఉంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో సీజనల్ వ్యాధులు కూడా ప్రబలుతాయి. కొన్నిజాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, వైద్యులు, విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు.



ఈ సూచనలు తప్పనిసరి

అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలి.
ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది
సెల్ఫీ, ఫొటోల కోసం చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల వద్దకు వెళ్లకూడదు
వాగులు, వంకలు వరద ప్రవాహాన్ని దాటేందుకు ప్రయత్నించకూడదు
వర్షం పడుతున్నప్పుడు చెట్ల కింద ఉండకూడదు
చిన్నపిల్లలు వర్షంలో ఆడకుండా, తడవకుండా చూసుకోవాలి
విద్యుత్ స్తంభాలు, నియంత్రికలు, వైర్లు, మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలి
వర్షంలో తడవకుండా ఉంటే ఇన్ఫెక్షన్లు దరిచేరవు
ఈ కాలంలో జలుబు, దగ్గు, చిన్నపాటి జ్వరం సాధారణంగా వస్తుంటాయి.
కాబట్టి కాచి వడపోసి, చల్లార్చిన నీటిని తాగాలి
కూరగాయలు, పండ్లను బాగా కడగి తినాలి
వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి
నిలువ ఉంచిన ఆహారాలను తినడం వల్ల ఇన్‌ఫెక్షన్ వచ్చి రోగనిరోధక శక్తి తగ్గుతుంది
దగ్గు, జలుబుతో బాధపడే వారు తినే ఆహారం, పానీయాలను ఎవరితోనూ పంచుకోవద్దు
ఈ కాలంలో శీతలపానీయాలు జోలికి అస్సలు వెళ్లకూడదు.
రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాలను తీసుకోవాలి
విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి
ఉతికిన వస్త్రాలను తీగలపై ఆరేసేప్పుడు జాగ్రత్తలు పాటించాలి
ట్రాన్‌ఫార్మర్ల వద్ద శబ్దం వస్తే వెంటనే విద్యుత్‌శాఖకు తెలియజేయాలి
వర్షం పడుతున్నప్పుడు మోటార్లను తడి చేతులతో ఆన్ చేయకూడదు
తెగిపడిన, వేలాడుతున్న తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్‌తీగలను తాకరాదు
విద్యుత్ మరమ్మతుల కోసం సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలి
ఎవరైనా విద్యుదాఘాతానికి గురైతే ఆ వ్యక్తి తాకకూడదు
వ్యవసాయ పంపుసెట్లను, స్టార్టర్లకు విధిగా ఎర్త్ ఏర్పాటు చేయాలి
ఏదైనా సమస్య ఉంటే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడాలి.
సొంతం నిర్ణయాలు దూరంగా ఉండండి.

వైరల్ ఇన్ఫెక్షన్ సోకకుండా జాగ్రతలు పాటించండి



భారీ వర్షాలు కురుస్తున్నందున వైరల్ ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఎక్కువ. కాబట్టి ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంతో జాగ్రత్తలు పాటించాలి. కాచి, వడపోసిన నీటిని మాత్రమే తాగాలి. ముఖ్యంగా గర్భిణులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. బయట ఆహారం తినకూడదు, మందులు సమయానికి వేసుకోవాలి, అత్యవసరకమైతే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ శివదయాల్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త

పంటల వైవిధ్యీకరణకు మొగ్గుచూపాలి

● వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, ప్రిన్సిపాల్ శ్రీదేవి


రైతులకు లింగాకార్షక బుట్టలు, మందులను అందజేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సిద్దిపేటరూరల్, సెప్టెంబరు 3 : రైతులు పంటల వైవిధ్యీకరణ వైపు మొగ్గుచూపాలని తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శ్రీదేవి పేర్కొన్నారు. సిద్దిపేటరూరల్ మండలం తోర్నాల శివారులోని వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఏరువాక కేంద్రం వ్యవసాయ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వివిధ పంటల్లో ఉత్తమ సాగు పద్ధతుల పై రైతులు-శాస్త్రవేత్తలు-విద్యార్థులు చర్చాగోష్టిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త శ్రీదేవి రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధిలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాత్ర గురించి వివరించారు. అనతికాలంలోనే విశ్వవిద్యాలయం నుంచి రూపొందించిన వంగడాలు, సాంకేతిక అంశాలను తెలిపారు. వరిలో మొగిపురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్, పత్తిలో రసం పీల్చు పురుగులకు అసెఫేట్, సమగ్ర సస్యరక్షణ చర్యల్లో భాగంగా వేప నూనె, లింగాకర్షక బుట్టలు, ల్యూర్లు (వరిలో మొగి పురుగు, పత్తి గులాబీ రంగు పురుగు మరియు మొక్కజొన్న కత్తెర పురుగు) అందజేశారు. అనంతరం చర్చాగోష్టిలో భాగంగా శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీజయ, డాక్టర్ సీహెచ్. పల్లవి, డాక్టర్ ఈ.ఉమారాణి, ఎ.సరిత, డాక్టర్ ఎ.రమాదేవి, డాక్టర్ డి.శ్వేత, సతీష్, ఎల్.రాజాలు వివిధ పంటలలో రైతులు ఎదుర్కుంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలకు సూచనలు నివారణ మార్గాలను రైతులకు వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి రాధిక మాట్లాడారు. రైతులకు పలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. పెసరలో ఎంజీజీ-335 రకంలో రైతులు, విద్యార్థుల సమక్షంలో క్షేత్రస్థాయి ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ యల్. రాజా, ఇర్కోడ్, బస్వాపూర్, ముండ్రాయి, ఘనపూర్, అంకుషాపూర్, చిన్నకోడూర్, చిట్టాపూర్ గ్రామాల రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చర్చాగోష్టిలో రైతులు, విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి టెన్నికాయిట్

క్రీడా పోటీలకు ఎంపిక

సిద్దిపేటటౌన్, సెప్టెంబరు 3: జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు సిద్దిపేటకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 1 నుంచి 3 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అండర్ 14 బాలుర విభాగం పోటీల్లో సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చందు, దినేష్, బాలికల విభాగంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బెజ్జంకి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తన్విక ఎంపికైనట్లు అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కాటం శ్రీనివాస్, కార్యదర్శి రాజ్‌కుమార్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలు ఈనెల 30 నుంచి అక్టోబరు 4 వరకు జమ్మూ రాష్ట్రంలో జరుగుతాయని వారు చెప్పారు. రాష్ట్రం తరఫున పాల్గొని జాతీయస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇస్లాంపూర్‌లో ఫీడల్ చానెల్ కాలువకు గండి

● పెద్దచెరువు నిండుతుండడంతో గుర్తుతెలియని వ్యక్తుల పని
● గండిని పూడ్చిన గ్రామస్థులు

తూప్రాన్, సెప్టెంబరు 3: తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ పెద్దచెరువు ఫీడర్ చానెల్‌కు గుర్తుతెలియని కొందరు వ్యక్తులు గండి పెట్టారు. గుర్తించిన గ్రామస్తులు గండిని పూడ్చారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు తూప్రాన్ పెద్దచెరువులోకి ఫీడర్ చానెల్ ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఈ క్రమంలో చెరువు పూర్తిస్థాయిలో నిండే పరిస్థితి ఏర్పడింది. అయితే చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పంటలు సాగు చేసిన చెరువు నిండకుండా కుట్ర పన్నారు. చెరువులోకి నీరొచ్చే ఫీడర్‌చానెల్‌కు సోమవారం రాత్రి గండి కొట్టారు. నీరంతా వృథాగా పోవడాన్ని గుర్తించిన గ్రామస్తులు ఎక్స్‌వేటర్ సహాయంతో గండిని పూడ్చివేశారు. గ్రామానికి చెందిన రాజు, నవీన్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


గండిని పూడుస్తున్న గ్రామస్థులు

కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

● పంచాయతీరాజ్ సిద్దిపేట ఎస్ఈ జోగారెడ్డి

తూప్రాన్, సెప్టెంబరు 3: తూప్రాన్ పట్టణ పరిధి ఆబోతుపల్లి వద్ద దెబ్బతిన్న కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిద్దిపేట జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ జోగారెడ్డి తెలిపారు. తూప్రాన్ శివారులో గౌడిగూడెం రోడ్డులో హల్దీవాగుపై నిర్మించిన కాజ్‌వే భారీ వర్షాలకు దెబ్బతింది. దీంతో మంగళవారం ఈఈ చిరంజీవచారి, ఏఈ మధుసూదన్‌తో కలిసి పరిశీలించిన ఎస్ఈ జోగారెడ్డి పరిశీలించారు. రెండు, మూడు రకాలుగా డిజైన్ చేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈకి సూచించారు. కాజ్‌వే మీదుగా నీటి ప్రవాహం తీరును కూడా ఇరిగేషన్ అధికారులతో సంప్రదించి సిద్ధం చేయాలని చెప్పారు. తూప్రాన్ పట్టణ పరిధి కిష్టాపూర్ రోడ్డులో హల్దీవాగుపై నిర్మించిన కాజ్‌వే గతంలో దెబ్బతినగా వియరింగ్ కోట్ (లేయర్) వేశారు. భారీ వర్షాలకు లేయర్ ఎలా ఉందో పరిశీలన చేశారు. మనోహరాబాద్ మండలం కొండాపూర్ వద్ద దెబ్బతిన్న కల్వర్టును పరిశీలించి, కొత్తగా నిర్మాణం చేసేందుకు ప్రతపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. వారి వెంట డీఎల్‌పీవో యాదయ్య, ఎంపీడీవో శేషాద్రి, ఎంపీవో సతీష్ పాల్గొన్నారు.


ఆబోతుపల్లి వద్ద గౌడిగూడెం రోడ్డుపై దెబ్బతిన్న కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎస్ఈ, ఈఈలు



పండుటాకుకు

ఎంత కష్టం

● ఇంటి నుంచి తప్పిపోయి, వివరాలు చెప్పలేని స్థితిలో వృద్ధురాలు

శివ్వంపేట, సెప్టెంబరు 3 : ఇంటి నుంచి తప్పిపోయి, ఎటు వెళ్లాలో తెలియక, నడవలేని స్థితిలో, ఒంటిపై వస్త్రాలు లేక ఆకలితో అలమటిస్తూ కన్నసాయంతో కుటుంబీకుల కోసం ఓ పండు వృద్ధురాలు పడరాని పాట్లు పడుతుంది. సంగారెడ్డి-గజ్వేల్ రహదారిలో శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల బాయన చెరువు సమీపంలో నర్సాపూర్ వైపు నుంచి ఓ వృద్ధురాలు ఒంటిపై వస్త్రాలు లేకుండా దీనావస్థలో నడుచుంటూ వస్తుంది. చలించిన గూడూరు మాజీసర్పంచ్ కృష్ణ గౌడ్, ఎదుల్లా పూర్‌కు చెందిన ముత్యాలు ఆమెకు వస్త్రాలు అందజేశారు. అనంతరం ఆమెను చిన్న గొట్టిముక్ల చౌరస్తాలో విడిచిపెట్టారు. ఆమెను స్థానికులు ప్రశ్నించగా ఎలాంటి సమాధానం చెప్పలేకపోతుంది. తనకు ముగ్గురు కొడుకులు ఉన్నారని తప్ప ఇంటి, ఊరి వివరాలు చెప్పలేని స్థితిలో ఉంది. ఆవిడ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని స్థానికులు తెలిపారు.

మేకల దొంగల ముఠా అరెస్టు

● మూడు జిల్లాల్లో భారీ ఎత్తున దొంగతనం
● రూ.4,71,000 నగదు, 9 మేకలు స్వాధీనం

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 3 : మేకల చోరీలకు పాల్పడుతున్న ముఠాను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పెద్దశంకరంపేటలో పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి వివరాలు వెల్లడించారు. రోజువారీగా పోలీసులు ఉదయం తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కొందరు పట్టుబడ్డారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో విచారించగా అసలు నిజం చెప్పారు. వీరంతా ఇప్పటి వరకు కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలో మొత్తం 16 దొంగతనాలు, దాదాపు 100కు పైగా మేకలను దొంగిలించారని తెలిపారు. వారి నుంచి రూ.4,71,000 నగదును, 9 మేకలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వీరు మొత్తం 11 మంది కలిసి ఈ చోరీలకు పాల్పడుతున్నారని, అందులో ఆరుగురిని పట్టుకున్నట్లు చెప్పారు. ఐదుగురు పరారీలో ఉన్నట్లు ఆమె వివరించారు. అలాగే చోరీకి పాల్పడిన రెండు వాహనాలను కూడా అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అరెస్టయిన వారిలో గడిపెద్దాపూర్‌కు చెందిన అనిల్‌కుమార్, ఎరుకల అనిల్, ఎరుకలగోపాల్, ముసలాపూర్‌కు చెందిన చిన్నకటికే ఖదీర్‌పాషా, ఇప్ప మహేందర్, సంగారెడ్డికి చెందిన మహమ్మద్ షాహీద్ ఉన్నట్లు తెలిపారు. సమావేశంలోపేట ఎస్ఐశంకర్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్‌లో నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ రేణుకారెడ్డి

పీసీబీ ఎంఎస్‌తో గడ్డపోతారంవాసుల సమావేశం

జిన్నారం, సెప్టెంబరు 3 : జిన్నారం మండలం గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని పరిశ్రమల కాలుష్య సమస్యపై ఆ గ్రామవాసులు మంగళవారం సనత్‌నగర్‌లోని పీసీబీ కార్యాలయంలో పీసీబీ మెంబర్ సెక్రటరీ రవితో సమావేశమయ్యారు. ఇటీవల గడ్డపోతారం పంచాయతీ కిష్టయ్యపల్లికి చెందిన రైతు సాయికుమార్‌కు చెందిన 15 గేదెలు పరిశ్రమల కాలుష్య జలాలు సేవించి మరణించాయి. గేదెల మృతిపై స్థానికులు ఇటీవల పీసీబీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు పరిశ్రమల కాలుష్యంపై అధ్యయనం కోసం కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలుష్యం తీరు, పశువుల మృతికి కారణాలపై నివేదిక అందిన అనంతరం కాలుష్య నియంత్రణకు చర్యలు, నష్టపరిహారం అంశంపై చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ సర్పంచులు ప్రకాశంచారి, నీరుడి శ్రీనివాస్, ఎంపీ అశోక్, మాజీ ఎంపీటీసీ బాసెట్టి గారి రాజు, నాయకులు వెంటేష్, వేణు, శివశంకర్ పాల్గొన్నారు. గేదెల మృతికి నష్టపరిహారం విషయంలో యువ రైతుకు న్యాయం చేయాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి విన్నవించారు.


పీసీబీ కార్యాలయానికి వెళ్లిన గడ్డపోతారం వాసులు

తాళం వేసిన ఇంట్లో చోరీ

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 3 : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మంగళవారం సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆదర్శనగర్ రోడ్డునెంబర్ 7లో నివాసముంటున్న రాజేందర్ సోమవారం ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లాడు. భార్య కూడా మూడు రోజుల క్రితం బోనాల పండుగకు ఊరికి వెళ్లింది. సోమవారం రాత్రి దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న పది తులాల వెండి ఆభరణాలు, అరతులం బంగారం, రూ.60,000 నగదు దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం రాజేందర్ బంధువులు ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. వెంటనే వారు రాజేందర్‌కు అతని భార్యకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. రాజేందర్ భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


జహీరాబాద్: బూచనెల్లి-బరూర్ గ్రామాల మధ్య నారింజవాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్


కల్హేర్: సిర్గాపూర్‌లో నీట మునిగిన పత్తి పంటను చూపుతున్న రైతు సుభాష్‌రావ్


కల్హేర్: నిజాంపేట మండలంలోని బాచేపల్లిలో కూలిన ఇల్లు, ధ్వంసమైన వంట పాత్రలు


నారాయణఖేడ్: వెంకటాపూర్‌లో కూలిన గృహం


సిర్గాపూర్-చీమల్‌పాడ్ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు


వట్‌పల్లి మండలం గౌతాపూర్ శివారులో వర్షం తాకిడికి కొట్టుకుపోయిన రోడ్డు


కంది: కంది-శంకర్‌పల్లి హైవేపై


చేగుంట: చిటోజిపల్లి లో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారి


నిజాంపేట: కూలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న తహశీల్దార్ సురేష్ కుమార్


చిన్నశంకరంపేట: టీ మాందాపూర్ బీటీ రోడ్డుపై కుంగిన బ్రిడ్జిని పరిశీలిస్తున్న హనుమంతరావు


పెద్దశంకరంపేట: బూర్గుపల్లిలో భారీ వర్షాలకు కూలిన ఇల్లు


నర్సాపూర్: బ్రాహ్మణపల్లిలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్


వెల్దుర్తి: బండపోసన్‌పల్లి అప్పు కుంటకు మరమ్మతులు చేపడుతున్న అధికారులు


వెల్దుర్తి: శేరిలోని వ్యవసాయ పొలంలోకి భారీగా చేరిన వర్షపు నీరు

ఎడతెగని వర్షాలతో..

కూలిన ఇళ్లు.. నీట మునిగిన పంటలు

దాదాపు మూడు రోజుల పాటు ఎడతెగని వర్షాల నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లు వరదకాలువలను తలపించాయి. వరద ప్రవాహానికి రోడ్లపైన కల్వర్టులు ధ్వంసం కావడంతో మంగళవారం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులెదురయ్యాయి. పలుచోట్ల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. వరదనీటి ప్రవాహాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కూలిన పాత ఇళ్లను, పంట నష్టాన్ని పరిశీలించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు జాగ్రత్తలు సూచించారు.

జహీరాబాద్, సెప్టెంబరు 3: సంగారెడ్డి జిల్లా బూచనెల్లి-కర్ణాటకలోని బరూర్ గ్రామాల మధ్యన గల నారింజవాగు ప్రవాహంతో పొంగుతున్నందున పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రవీందర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆయా గ్రామాల మధ్యలో గల నారింజ వాగు నీటిప్రవాహన్ని పరిశీలించారు. మండలంలోని కొత్తూర్(బి)వద్ద నారింజప్రాజెక్టు గేటును 5ఫీట్లఎత్తు ఎత్తడంతో దిగువప్రాంతానికి వరద నీటి ప్రవాహం పెరిగిందన్నారు. ఆయా గ్రామాల మధ్యలోగల బ్రిడ్జిలపై నీటిప్రవాహం పూర్తిగా తగ్గే వరకు రోడ్డుకు అడ్డంగా ముళ్ళపొదలను వేశామన్నారు. కాగా వర్షాలకు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో 18ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని ఆర్డీవో రాజు తెలిపారు.

● కల్హేర్: లోతట్టు ప్రాంతంలోని పంటలు మునిగి రైతులకు నష్టం వాటిల్లగా పాత నివాస గృహాలు కూలిపోయాయి. మండలంలోని మీర్‌ఖాన్‌పేట, బాచేపల్లి గ్రామాల నడుమ ఉన్న వంతెనపై నుంచి మాసాన్‌పల్లి వాగు మంగళవారం ఉధృతంగా ప్రవహించడంతో వరి నీట మునిగింది. సిర్గాపూర్ శివారులో నల్లవాగు ప్రాజెక్టులోకి వచ్చే వరద వాగులు పొంగడంతో పత్తి, సోయా పంటలు నీట మునిగాయి. సిర్గాపూర్ సాకి చెరువు తూము షట్టర్ నుంచి భారీగా నీరు లీకేజి అయ్యింది. సంగెం గ్రామం, సింగర్‌బొగడ తండాలకు రోడ్డు సంబంధాలు తెగిపోయాయి.నిజాంపేటమండలం బాచేపల్లిలో, కల్హేర్ మండలం మహాదేవ్‌పల్లిలో పలు ఇళ్లు కూలాయి.

● నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. వర్షబీభత్సం వల్ల 28 గృహాలు కూలినట్లు అధికారులు తెలిపారు. పంట పొలాల్లో నీరు చేరి వరి, పత్తి, పంటకు నష్టం వాటిల్లింది. సంజీవన్‌రావుపేట పుష్పాలవాగు పెద్దఎత్తునప్రవహించింది. కల్హేర్‌మండలంలో 4ఇళ్లు, మనూరులో 5, ఖేడ్‌లో 6, నిజాంపేటలో 5, సిర్గాపూర్‌లో 8 గృహాలు కూలినట్లు ఆర్డీవో అశోక చక్రవర్తి తెలిపారు. కాగా ఖేడ్ మండలంలో భారీ వర్షాలవల్ల సీతారాం తండాకు చెందిన గణపతి, మారోని బాయిల ఇల్లు కూలిపోవడంతోమంగళవారం ఎన్ఆర్ఐ గుర్రపు మశ్చందర్ పరామర్శించి ఆర్థికసాయాన్ని అందించారు. నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని మంగల్‌పేటలో పలు గృహాలు పాక్షికంగా కూలి పోయాయి. దీంతో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్‌ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, తహసీల్దార్, భాస్కర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు కూలిన గృహాలను పరిశీలించారు.


హవేళిఘణపూర్: దూప్‌సింగ్ తండా బ్రిడ్జిని పరిశీలిస్తున్న మెదక్ ఎమ్మెల్యే, కలెక్టర్

● వట్‌పల్లి: మండలంలోని గౌతాపూర్ శివారులో మంగళవారం పంట పొలాలు నీటిలో మునిగిపోగా, రోడ్డు కొట్టుకుపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.

● కంది, సెప్టెంబరు 3 : కందిలో మంగళవారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. కందిలోని జాతీయ రహదారిపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. చిమ్నాపూర్, ఎర్దనూర్ తండా, కాశీపూర్ గ్రామాల చెరువులు అలుగులు పారాయి. మండలపరిధిలోని బ్యాతోల్ గ్రామంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మల్లెపల్లి రాంరెడ్డి ఇళ్లు మంగళవారం కూలిపోయింది. తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీవో మహేందర్‌రెడ్డి గ్రామాలను సందర్శించి చెరువులు, కుంటలను పరిశీలించారు. కంది-శంకర్‌పల్లి హైవేలో భారీ వాహనాల రాకపోకల ఒత్తిడి కారణంగా భారీ గుంత ఏర్పడింది. ఈ హైవేలో నిత్యం వందలాది ద్విచక్రవాహనాలు, కార్లు, లారీలు, ట్రాన్స్‌పోర్ట్ వెహికిల్స్ తిరుగుతాయి. కంది చౌరస్తా వద్ద ఇప్పుడు ఈ భారీ గుంత ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

● మనూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో 10గృహాలు కూలిపోయినట్లు తహసీల్దార్‌కార్యాలయ సిబ్బంది తెలిపారు. అతిమ్యాల్,పుల్‌కుర్తి, దుద్దగొండ, ధన్వార్‌గ్రామాల్లో 10గృహాలు కూలిపోయినట్లు ఆర్ఐ.శంకర్‌రెడ్డి తెలిపారు. ఎడతెగని వర్షాలకు చేతికొచ్చిన పెసరి, మినుము పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు.

● చేగుంట: చేగుంట మండల పరిధిలోని పలు గ్రామాల్లో చెరువు కుంటలు అలుగులు పారడంతో రైతుల సంతోషం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో అలుగు పారుతున్న చెరువు కుంటలను అధికారులు సందర్శించి పరిశీలించారు. వర్షాల కారణంగా చేగుంట మండల పరిధిలోని పలు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు పర్యటించి కూలిపోయిన ఇండ్ల వివరాలను సేకరిస్తున్నారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలతో ఇప్పటివరకు 31 ఇళ్లు దెబ్బతిన్నాయని రెవెన్యూ అధికారులు వివరించారు.


అల్లాదుర్గం: కల్వర్టు గోడ కూలి పక్కనే చెట్టు పై ఒరిగిన దృశ్యం

● కౌడిపల్లి: మండలంలోని సదాశివపల్లి కనికల చెరువు అలుగు పారడంతో యువకులు పెద్ద ఎత్తున చేపలు పట్టుకున్నారు. ఇదే క్రమంలో మండలంలోని ముత్రాజ్‌పల్లి, దేవులపల్లి, వెంకట్రావ్‌పేట్, నాగ్‌సాన్‌పల్లి, తిమ్మపూర్, పాంపల్లి, ధర్మసాగర్‌కు చెందిన అనేక చెరువులు అలుగు పారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

● నిజాంపేట: మండల కేంద్రంతోపాటు నందిగామ గ్రామంలో మంగళవారం మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పర్యటించి వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వర్షాల కారణంగా రహదారి వెంబడి డ్రైనేజీ లేక ఇళ్ల మధ్యలో నీరు వెళ్లడంతో ప్రజలు ఇబ్బంది పడిన విషయాన్ని గమనించిన మాజీ ఎమ్మెల్యే జాతీయ రహదారి వెంబడి డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆర్ అండ్ బీ అధికారులకు ఫోన్ ద్వారా తెలిపారు. అదేవిధంగా తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా మండల వ్యాప్తంగా 18 ఇళ్లు కూలిపోయాయని తహసీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు.

● చిన్నశంకరంపేట: మండలంలో భారీ వర్షాలకు టీమాందాపూర్ మెదక్ వెళ్లే రహదారిపై ఉన్న బ్రిడ్జి కుంగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఆర్‌అండ్‌బీ ఈఈతో, కాంగ్రెస్ నాయకులతో కలిసి కుంగిపోయిన బ్రిడ్జిని పరిశీలించారు. రాకపోకలకు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పట్లు చేసేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, పలు అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

● నర్సాపూర్: నర్సాపూర్ మండలంలో ఎడతెరిపి లేకుండా రెండురోజుల పాటు కురిసిన వర్షానికి 15 ఇళ్లు పూర్తిగా, 56 పాక్షికంగా మొత్తం 71 ఇళ్లు దెబ్బతిన్నట్లు ఎంపీడీవో మాధవి లత పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఎంపీడీవో విలేకరులతో మాట్లాడుతూ ఈ వివరాలను వెల్లడించారు. కాగా మండలంలోని బ్రాహ్మణపల్లిలో దెబ్బతిన్న ఇళ్లను తహసీల్దార్ శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. బాధితులకు ప్రభుత్వపరంగా సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

● వెల్దుర్తి: మండలంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లలోకి భారీగా వర్షపు నీరు చేరి అలుగు పారుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి మండలంలో ఎడతెరిపి లేకుండా ముసురు పట్టుకుంది. పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరాయి. బండపోసన్‌పల్లి అప్పకుంటకు బుంగ పడి నీరు వృథాగా పోవడంతో స్పందించిన ఇరిగేషన్ డీఈఈ రాజేందర్, ఏఈ కవిత బుంగ పడిన కుంటకు నీరు వృథా పోకుండా తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఉప్పులింగాపూర్ హల్దీ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వర్షాలకు మండలంలో 16 ఇళ్ళు పాకిక్షంగా దెబ్బతిన్నాయని, గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు 12ఇళ్ళు పాకిక్షంగా దెబ్బతిన్నాయని తహసీల్దార్ కృష్ణ తెలిపారు.

● హవేళిఘణపూర్: అధిక వర్షాల వల్ల కల్గిన నష్టాలను అంచనా వేసి ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందజేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దూప్‌సింగ్ తండా బ్రిడ్జి, హవేళిఘణపూర్ పెద్ద చెరువు గండిలను వారు పరిశీలించారు. దూప్‌సింగ్ తండా బ్రిడ్జికి నూతన టెండర్ పిలిచి వేగంగా నిర్మాణం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, నాయకులు ఉన్నారు.

● అల్లాదుర్గం: ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో నివాస గృహాలు కూలిపోయాయి. సోమవారం నాటి రాత్రి మండలంలోని వెంకట్రావుపేట సమీపంలోని రేగోడ్ వెళ్లే ప్రధాన రహదారిపై నిర్మించిన కల్వర్టు అడుగు భాగం నుంచి కూలిపోతుండటంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేశారు. అల్లాదుర్గం సమీపంలోని మెట్టుగడ్డ చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన హనుమాన్ దేవాలయం సమీపంలో విద్యుత్ స్తంభం కూలిపోవడంతో పెను ప్రమాదం తప్పిందని రైతులు తెలిపారు. పత్తి పంటకు కూడ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోయారు.

● పెద్దశంకరంపేట: మండలపరిధిలోని రామోజీపల్లి, పెద్దశంకరంపేట,తిరుమలాపూర్ తదితర చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. పేటమండలపరిధిలోని పెద్దశంకరంపేట, బూర్గుపల్లి, గొట్టి ముక్కుల మల్కాపూర్, జి.వెంకటాపూర్, రామోజీపల్లి, టెంకటి, వీరోజిపల్లి తండా తదితర గ్రామాల్లో భారీ వర్షాలకు పలు పలు గృహాలు కూలిపోయాయి.తిరుమలాపూర్ చెరువు వద్ద అలుగు పారడంతో తహసీల్దార్ గ్రేస్‌బాయ్, ఎస్ఐ శంకర్, అధికారులు పరిశీలించారు.

రైతులకు వర్షాలతో మేలు

కౌడిపల్లి, సెప్టెంబరు 3: ప్రస్తుతం కురిసిన వర్షంతో రైతులకు మేలు జరుగుతుందని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని భాగ్యలక్ష్మి ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ వరి, కందులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతులు ఆధైర్య పడవద్దని సూచించారు.

ట్రిబుల్ ఆర్‌కు సమస్యపై సమావేశం

శివ్వంపేట, సెప్టెంబరు 3: ట్రిబుల్ ఆర్ భూసమస్యలపై మండల పరిధిలోని పోతులబోగుడ గ్రామంలో రైతులతో రెవెన్యూ అధికారులు ఆర్.ఐ కిషన్, సునీల్ మంగళవారం సమావేశం నిర్వహించారు. పోతులబోగుడలో ట్రిబుల్ ఆర్‌కు కేటాయించిన 44 ఎకరాల భూమిలో సుమారు 40 మంది రైతులకు సంబంధించి రికార్డులో ఒక నంబర్ ఉండగా పొజిషన్‌లో మరో సర్వే నెంబరు ఉండడంతో సమస్యపై చర్చించారు. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, ఆర్ఐ తెలిపారు.

పంటలను రక్షించుకోవాలి

నారాయణఖేడ్, సెప్టెంబరు 3: వర్షాల నుంచి పంటలను రక్షించుకోవడానికి రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ_ భారీ వర్షాలు కురుస్తున్నందున పంటలకు క్రిమి సంహారక మందులను పిచికారిచేయడం నిలిపివేయాలన్నారు. పొలాల నుంచి వర్షం నీటిని తొలగించాలన్నారు. చీడపీడల నివారణ పద్ధతులను పాటించాలని, ఏవైనాసమస్యలు ఉంటే తమను గాని ఏవో లేదా ఏఈవోలను గాని సంప్రదించాలన్నారు.

● గుమ్మడిదల: మండలంలో ప్రస్తుతం వరి 6,800 ఎకరాలు, పత్తి 800 ఎకరాలు, మక్కలు 300 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు ఏవో శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని పంటలు శాఖీయ దశలో ఉన్నందున ప్రస్తుత వర్షాలకు యాజమాన్య పద్ధతులను రైతులు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలి: ఖేడ్ ఎమ్మెల్యే


ఖేడ్‌లో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 3: భారీవర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆర్డీవో అశోక చక్రవర్తితోపాటు డివిజన్‌పరిధిలోని తహసీల్దార్‌లతో ఏర్పాటు చేసిన సమీక్షసమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఖాంజీపూర్, అనంత్‌సాగర్, నమ్లీమేట్ సమీపాల్లో వంతెనల కోసం ఎఫ్‌డీఆర్ కింద ప్రతిపాదనలు పంపించామని అధికారులు తెలిపారు. ఫాంలాండ్స్ లేఔట్‌ల విషయాల్లో నిబంధనలు అమలయ్యే విధంగా చూసి రిజిస్ట్రేషన్‌లకు అనుమతించాలన్నారు. పలు గురుకులాలు, పాఠశాలల పైకప్పుల నుంచి నీరు కారకుండా మరమ్మతుల కోసం వివరాలు పంపాలని ఎంఈవోలకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్‌లు భాస్కర్, విష్ణుసాగర్, తదితరులుఉన్నారు.

బాధితులకు నిత్యావసరాల అందజేత

నారాయణఖేడ్‌మున్సిపాలిటీపరిధిలోని మంగల్‌పేటలో భారీవర్షాలతో ఇళ్లను కోల్పోయిన బాధితులు పసుల శ్రీనివాస్, ఇప్పలి అంబాదాస్, శాంతమ్మలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి మంగళవారం సాయంత్రం పరామర్శించి నిత్యావసర సరుకులను అందజేశారు. వెంట మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్‌దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్ ఉన్నారు. పట్టణంలోని కల్వనా హనుమాన్ ఆలయంలో నిర్వహించిన నవనాథ పారాయణ పురాణ పఠన పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్గాంపీఠాధిపతికరణ్ గజేంద్ర భారతిమహారాజ్ నవనాథ పురాణ పఠనం విశేషాలను వివరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే హక్కు సునితారెడ్డికి లేదు

● డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, సెప్టెంబరు 3: అధికారంలో ఉన్న పదేళ్ల పాటు నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి విమర్శించారు. మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేవలం పదవుల కోసమే తప్ప ప్రజల కోసం ఆలోచించని వ్యక్తి సునీతారెడ్డి అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ మూడుపర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా అవకాశమిస్తే కష్టకాలంలో ఉన్న పార్టీని వీడి పదవీ కోసం బీఆర్ఎస్‌లో చేరి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటికీ నియోజకవర్గానికి చేసిన ఒక్క మంచి పని లేదన్నారు. అటువంటి వ్యక్తి ప్రజల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంను విమర్శించడం తగదన్నారు. ఈ ప్రాంత నాయకులుగా రాజిరెడ్డితో పాటు తాను ఇతర నాయకులతో కలిసి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు తేవడానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తూనే ఉన్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇష్టానుసారంగా విమర్శలు చేస్తే సహించేది లేదని ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డిలు హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సుహాసినిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లలిత, జ్యోతిసురేష్‌నాయక్, బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను తిట్టడమే కాంగ్రెస్ పని: పద్మారెడ్డి

హవేళిఘణపూర్, సెప్టెంబరు 3: కాంగ్రెస్ ప్రభుత్వం విపత్తును విడిచి ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకుందని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం హవేళిఘణపూర్ గ్రామ శివారులోని పెద్దచెరువుకట్ట తెగిన ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. చెరువుకు బుంగపడిన వెంటనే ముందస్తుగా చర్యలు తీసుకుని ఉంటే పెద్దమొత్తంలో విపత్తు జరిగేది కాదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇంత పెద్దమొత్తంలో పంటనష్టం జరిగిందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన ప్రభుత్వం మొద్దు నిద్ర వల్లనే రాష్ట్రంలో 32 మంది చనిపోయారని ఆరోపించారు. తెగిపోయిన హవేళిఘణపూర్ చెరువు కట్టకు ఇసుక బస్తాలు వేసి నీటిని ఆపాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. పద్మారెడ్డి వెంట బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ లావణ్యరెడ్డి, నాయకులు. రైతులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మాసాయిపేట సెప్టెంబర్ 3: జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగిన వివాహిత గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. చేగుంట ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. మాసాయిపేటకు చెందిన పెంటమ్మ(63) మూడు రోజుల క్రితం ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబీకులు గాంధీ ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'హైడ్రా'తో చెరువులకు రక్షణ: జేఏసీ చైర్మన్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 3 : చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాను స్వాగతిస్తున్నామని కాలుష్య నివారణ జేఏసీ చైర్మన్ హనుమాన్‌గౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. చెరువులే కాకుండా నీరు పోయే నాలాలపై కూడా ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని దీని ద్వారా కొంత మేరకు ట్రాఫిక్ స్తంభించకుండా నివారించవచ్చన్నారు. ప్రభుత్వ స్థలాల్లో 30 నుంచి 50 ఏళ్లుగా ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్న నిరుపేదలకు రాజీవ్ గృహకల్ప, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

తోటల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

● ఫల పరిశోధనా సీనియర్ శాస్త్రవేత్త డా. వి. సుచిత్ర



సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 3 : అధిక వర్షాలతో పండ్ల తోటల పెంపకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని ఫల పరిశోధనా సీనియర్ శాస్త్రవేత్త వి. సుచిత్ర మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా నాటిన మొక్కలకు వెదురు కర్రలతో కట్టి వాటిని వంగిపోకుండా ఆధారం కల్పించాలని, దెబ్బతిన్న కొమ్మలకు సీకేరర్ ఉపయోగించి కత్తిరించి చివరకు సిడిసి లేదా బోర్డో మిశ్రమం పూయాలని సూచించారు. సాధ్యమైనంతవరకు వర్షపు నీటిని 48 గంటల కంటే ఎక్కువ సమయం చెట్ల చుట్టు నిలువకుండా చూసుకోవాలని, నిలిచిన నీటిని కాలువ చేసి తోట నుంచి బయటికి పంపించాలనాన్నరు. చెట్టు చుట్టు మట్టిని తీసివేయడం వల్ల వేరు కుళ్లిపోకుండా నష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. వర్షాలు పడే సమయంలో చీడపీడల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలను ఆమె వివరించారు.

ఎకరాకు రూ.25వేల పరిహారం చెల్లించాలి

● రైతు సంఘం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జయరాజ్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 3: నీట మునిగి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆయన సందర్శించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖాధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పంటలను పరిశీలించినవారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, నాయకులు బాబురావు, యోహాను, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మహికో కార్మికులకు అండగా కాంగ్రెస్ నాయకులు

మనోహరాబాద్, సెప్టెంబర్ 3: కాళ్లకల్ గ్రామ శివారులోని మహికో సీడ్ పరిశ్రమ ఈ నెల 21న రాత్రికి రాత్రే తాళం వేసిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం పరిశ్రమ ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. కార్మికుల నిరసనకు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు లద్దిపీర్ల శ్రీనివాస్‌గౌడ్, ఇతర కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. పరిశ్రమ సహకరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

తహసీల్దార్ ఎదుట 13మంది బైండోవర్

జహీరాబాద్, సెప్టెంబరు 3: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా డీజేలను ఏర్పాటు చేయరాదని పేర్కొంటూ ముందస్తుగా మంగళవారం పట్టణంలోని పలు డిజేదుకాణాల నిర్వాహకులు 13 మందిని తహసీల్దార్ రవీందర్ ఎదుట బైండోవర్ చేశామని పట్టణ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా వ్యవహరిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మునిపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

మునిపల్లి, సెప్టెంబర్ 3: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సంగారెడ్డి జిల్లా వైద్యాకారి గాయత్రిదేవి తనిఖీ చేసి ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు రూమ్‌లో కాకుండా బయట ఉన్న బెడ్లపై వైద్యం అందిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందని వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ రవిని ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆమె వెంట డీఐవో శశాంక్, మునిపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, పీహెచ్‌ఎన్ చంద్రబాను, సిబ్బంది ఉన్నారు.

నాలాలకు అడ్డంగా నిర్మాణాలు చేపట్టొద్దు: కమిషనర్


పట్టణంలోని నాలాలో నీటిప్రవాహన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

జహీరాబాద్, సెప్టెంబరు 3: పట్టణంలో వరదనీరు. మురుగునీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన నాలాలాపై అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన జహీరాబాద్ పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. అందులో భాగంగం డ్రీమ్‌వెల్లీ, మాణిక్ ప్రభు మహేశ్వా, ఆదర్శనగర్ సెకండ్‌వెంచర్, వసంతవిహార్, చెన్నారెడ్డికాలనీ తదితర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలాలపై నిర్మాణాలు చేపట్టడం మూలంగా నీటి ప్రవాహనికి సమస్యగా మారిందన్నారు. త్వరలోనే నాలాలపై ఉన్న నిర్మాణాలను కూల్చేస్తామన్నారు.

5,016 మట్టి ప్రతిమలు పంపిణీకి సిద్ధం

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 3: పట్టణంలో వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మొత్తం 5,016 మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్ తెలిపారు. కార్యక్రమాన్ని ఎస్పీ చెన్నూరి రూపేష్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం తోపాజి అనంతకిషన్ మాట్లాడుతూ దాతల సహకారంతో విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 3 : తెలంగాణ సాంస్కృతిక సారధి సభ్యులు మంగళవారం సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కళాజాత నిర్వహించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. కార్యక్రమంలో కళాకారులు సునీల్,కుమార్, డప్పోళ్ల రమేష్, దుర్గేష్, సంధ్య వినేష్, పవీన్, శంకర్ పాల్గొన్నారు.